

WWW.VIJAYAKERATAM.COM

RNI: APTEL/2010/34724

తెలుగు దినపత్రిక

విజయకెరటం

నిజం మా ధ్యేయం - ప్రజలే మా లక్ష్యం

VIJAYA KERATAM TELUGU DAILY



అక్టోబర్ 6 మంగళవారం 2026 | సంపుటి : 18 | సంచిక : 243 | పేజీలు : 4 | వెల రూ. 1.00/- | ఎడిటర్ : యం.డి.మక్సూద్ అహ్మద్

TUESDAY OCTOBER 6 2026 | VOL:18 | ISSUE: 243 | PAGES:4 | Rs. 1:00 | EDITOR:MD. MaKsood Ahmed

ఫామ్-6 మార్పులు.. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌పై రాహుల్ గాంధీ ఆరోపణలు..

ఇంటర్నెట్ డెస్క్: కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మరోసారి తీవ్ర ఆరోపణలు చేశారు. ఓటర్లుగా నమోదు చేసుకునేందుకు ఉపయోగించే ఫామ్-6లో మార్పులను జ్ఞానేశ్ కుమార్ చట్టవిరుద్ధంగా, బీజేపీకి అనుకూలంగా ఏకపక్షంగా చేశారని ఆయన ఆరోపించారు. ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టు సోమవారం కీలక వ్యాఖ్యలు చేయడంతో రాహుల్ గాంధీ స్పందించారు . ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియకు సంబంధించిన ఫామ్-6లో చేసిన మార్పులను సుప్రీంకోర్టు ఆమోదించలేదని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ స్పష్టం చేశారు. 'మార్చిన ఫామ్-6లో ఏదీ మేం ఆమోదించలేదు. ఎవరు మార్చారో రికార్డులు వచ్చిన తర్వాత చూడాలనుకుంటున్నాం' అని సీజేఐ వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో ఫామ్-6ను ఎవరి అనుమతితో మార్చారో తెలుసుకునేందుకు సంబంధిత రికార్డులను కోర్టు కోరింది .న్యాయస్థానం కోర్టు వ్యాఖ్యల నేపథ్యంలో రాహుల్ గాంధీ సోషల్ మీడియా వేదికగా జ్ఞానేశ్ కుమార్‌పై విమర్శలు చేశారు. ఫామ్-6ను ఆయన



సన్న బియ్యం ధరలపై హరీశ్ ఫైర్.. నాలుగు నెలల్లో 25 శాతం పెరిగాయంటూ విమర్శలు

హైదరాబాద్, అక్టోబర్ 5:

రాష్ట్రంలో నిత్యావసర ధరల నియంత్రణపై కాంగ్రెస్ ప్రభుత్వం చేతులెత్తేసిందంటూ మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. ధరల పెరుగుదలతో సామాన్యుడిపై పెను భారం పడుతోందన్నారు. వెంటనే ధరల పెరుగుదలపై సమీక్ష నిర్వాహించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రికార్డు స్థాయిలో పంట ఉత్పత్తి సాధించామని ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటోందన్నారు. ఉత్పత్తి పెరిగితే బియ్యం ధరలు ఎందుకు ఆకాశాన్నంటుతున్నాయని మాజీ మంత్రి ప్రశ్నించారు.'సన్న బియ్యం ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి .. రేవంత్ సర్కార్ నేల చూపులు చేస్తోంది. నిత్యవసర ధరల నియంత్రణపై కాంగ్రెస్ ప్రభుత్వం చేతులెత్తేసింది. సామాన్యుడిపై పెనుభారం పడుతుంటే పౌరసరఫరాల శాఖ మొద్దు నిద్రలో ఉంది. వెంటనే ధరల పెరుగుదలపై సమీక్ష నిర్వహించి తగిన చర్యలు తీసుకోవాలి. నిత్యావసరాల ధరలు సామాన్యుడి నడ్డి విరుస్తుంటే.. ధరలకు అడ్డుకట్ట వేయాల్సిన ప్రభుత్వం మొద్దు నిద్రలో ఉండటం దారుణం. ప్రభుత్వ నిర్లక్ష్యం, పర్యవేక్షణ వైఫల్యానికి సామాన్య ప్రజలే మూల్యం చెల్లిస్తున్నారు. సన్నబియ్యం ధరలు కేవలం నాలుగు నెలల్లోనే 25 శాతం పెరగడం ప్రభుత్వానికి కనిపించడం లేదా? రికార్డు స్థాయిలో పంట ఉత్పత్తి సాధించామని గొప్పలు చెప్పుకున్న ప్రభుత్వం... మరి ఉత్పత్తి పెరిగినప్పుడు ధరలు తగ్గాల్సింది పోయి.. బియ్యం ధరలు ఎందుకు ఆకాశాన్ని అంటుతున్నాయి?' అని ప్రశ్నించారు.'మీరు ఇస్తున్న సన్నబియ్యం పథకం సఫలం అయితే, ఎందుకు బియ్యం ధరలు అదుపు తప్పుతున్నాయి? మీరు ఇస్తున్న నాణ్యత లేని సన్నబియ్యాన్ని ప్రజలు వినియోగించడం లేదని చెప్పడానికి ఇది నిదర్శనం కాక మరేమిటి? ఆరుగాలం శ్రమించి పంట పండించిన రైతన్నకు ఎమ్ఎస్పీ(మీ్రా) పేరిట దక్కుతున్నది నామమాత్రపు ధర. కానీ మధ్య దళారులకు దక్కుతున్నది క్వింటాకు రూ.8000 పై మాటే. రైతుకు గిట్టుబాటు ధర లేదు.. వినియోగదారుడికి అందుబాటు ధర లేదు.. లాభపడుతున్నది మాత్రం మధ్య దళారులు? కళ్లముందే ఈ తతంగం అంతా జరుగుతుంటే,

(మిగతా 2వ పేజీలో..)



ఫ్యూచర్ సిటీలో విదేశీ వర్సిటీల క్యాంపస్‌లు..

ప్రత్యేక పాలసీకి తెలంగాణ సర్కార్ ప్లాన్

- అంతర్జాతీయ స్థాయి విద్యా సంస్థల ఏర్పాటుకు తెలంగాణ కీలక చర్యలు
- ఫ్యూచర్ సిటీలో ప్రముఖ విదేశీ యూనివర్సిటీల క్యాంపస్‌లు ఏర్పాటుకు ప్రత్యేక పాలసీ
- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశాలు
- అంతర్జాతీయ ప్రమాణాలతో విద్య, పరిశోధన, నైపుణ్యాభివృద్ధి అవకాశాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచన
- 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్'పైనా సమీక్ష



తెలంగాణలో అంతర్జాతీయ స్థాయి విద్యా సంస్థలను ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక చర్యలు చేపడుతోంది. ఫ్యూచర్ సిటీలో ప్రముఖ విదేశీ యూనివర్సిటీల క్యాంపస్‌లు ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక పాలసీ రూపొందించాలని

రామప్పను కాపాడేందుకు పెద్దఎత్తున ఉద్యమిస్తాం: కేటీఆర్

హైదరాబాద్, అక్టోబరు 5 :

సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్‌పై మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. భూములు దోచుకోవడం అయిపోయిందని.. ఇప్పుడు భూముల లోపల ఉన్న సంపద దోచుకొని, వారసత్వ కట్టడాలను కూల్చడానికి రేవంత్ సర్కార్ కుట్రలు పన్నుతుందని ధ్వజమత్తారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా కేటీఆర్ పోస్టు పెట్టారు. రామప్ప దేవాలయానికి అతి సమీపంలో



(మిగతా 2వ పేజీలో..)

పవన్ కల్యాణ్ ఆదేశాలతో ఇంద్రకీలాద్రిపై ప్రధాని మోదీ పేరిట పూజలు

- మోదీ 25 ఏళ్ల ప్రజా ప్రస్థానం పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ కార్యక్రమం
- పవన్ కల్యాణ్ ఆదేశాలతో ఎంపీ లింగమనేని రమేశ్ పూజల నిర్వహణ
- అమ్మవారికి విశిష్టమైన ఖడ్గమాల అర్చన జరపనున్న ఎంపీ
- ప్రధానికి ఆయురారోగ్యాలు, దీర్ఘాయుష్షు కలగాలని ఆకాంక్ష



ఓటుకు నోటు కేసులో కీలక మలుపు.. సుప్రీంకోర్టులో స్టీఫెన్‌సన్ ఇంప్లీడ్ పిటిషన్

- ఓటుకు నోటు కేసులో సుప్రీంకోర్టును ఆశ్రయించిన మాజీ ఎమ్మెల్యే స్టీఫెన్‌సన్
- ఈ కేసులో తనను ఇంప్లీడ్ చేయాలని పిటిషన్ దాఖలు
- బాధితుడిగా తన వాదనలు వినాలని కోర్టుకు విజ్ఞప్తి
- కేసును కొట్టివేయాలన్న రేవంత్ రెడ్డి పిటిషన్‌పై విచారణ వేళ ఈ పరిణామం
- పిటిషన్‌ను పరిగణనలోకి తీసుకున్న సుప్రీం, విచారణ వాయిదా



తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన 2015 నాటి ఓటుకు నోటు కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ప్రధాన ఫిర్యాదుదారు, నామినేటెడ్ మాజీ ఎమ్మెల్యే స్టీఫెన్‌సన్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తన వాదనలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని కోరుతూ ఆయన సర్వోన్నత న్యాయస్థానంలో ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేశారు.ఈ కేసు విచారణలో భాగంగా అదనపు వాదనలు వినిపించేందుకు తనకు అవకాశం కల్పించాలని స్టీఫెన్‌సన్ తన పిటిషన్‌లో కోరారు. ప్రధాన ఫిర్యాదుదారుగా

(మిగతా 2వ పేజీలో..)

భారత్-అమెరికా వాణిజ్య చర్చలపై నిర్మలా సీతారామన్ కీలక వ్యాఖ్యలు

- భారత్-అమెరికా వాణిజ్య చర్చల్లో స్తబ్దత ఏర్పడిందన్న నిర్మలా సీతారామన్
- వాణిజ్య లోటును తగ్గించుకోవాలని అమెరికా భావిస్తోందని వ్యాఖ్య
- ఈయూ ఒప్పందాన్ని విజయవంతమైన ఉదాహరణగా చూపిన ఆర్థిక మంత్రి



భారత్, అమెరికాల మధ్య కొంతకాలంగా కొనసాగుతున్న వాణిజ్య ఒప్పంద చర్చలు దాదాపుగా తుది దశకు చేరుకున్నప్పటికీ, ప్రస్తుతం అవి ప్రతిష్టంభనలో ఉన్నట్లు కనిపిస్తున్నాయని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. ఇరు దేశాల మధ్య వాణిజ్యం ప్రస్తుతం భారత్‌కు అనుకూలంగా ఉండటంతో, ఆ లోటును తగ్గించుకోవడానికి అమెరికా తీవ్రంగా ప్రయత్నిస్తోందని ఆమె వెల్లడించారు.సోమవారం ఢిల్లీలో నిర్వహించిన 'మ్యూనిచ్ లీడర్స్ మీటింగ్ 2026'లో ఆమె మాట్లాడారు. "వాణిజ్య ఒప్పందం కోసం ఇరు దేశాలు పట్టుదలగా చర్చలు జరిపాయి. ప్రస్తుతం ఇచ్చిపుచ్చుకునే ధోరణికి అతీతంగా చర్చలను ముందుకు తీసుకెళ్లడం కష్టతరంగా మారింది" అని ఆమె అభిప్రాయపడ్డారు. అయినప్పటికీ, ఈ చర్చలను మరింత ముందుకు తీసుకెళ్లే అవకాశాలను ఇరువర్గాలు అన్వేషించవచ్చని సూచించారు.భారత్‌తో వాణిజ్యం వల్ల తమకు ఏళ్లుగా

(మిగతా 2వ పేజీలో..)



విజయకేరళం
తెలుగు దినపత్రిక

02 జనరల్ న్యూస్

సం పా ద కీయం

సాంకేతికత పెరుగుతోంది.. మానవ సంబంధాలు తగ్గకూడదు

సాంకేతిక పరిజ్ఞానం మనిషి జీవితాన్ని ఎంతో సులభతరం చేసింది. ఒకప్పుడు గంటల సమయం పట్టే పనులు ఇప్పుడు నిమిషాల్లో పూర్తవుతున్నాయి. బ్యాంకింగ్ నుంచి విద్య వరకు, వైద్యం నుంచి వ్యాపారం వరకు దాదాపు ప్రతి రంగంలోనూ డిజిటల్ మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. మొబైల్ ఫోన్, ఇంటర్నెట్, కృత్రిమ మేధస్సు వంటి సాంకేతిక సాధనాలు మన దైనందిన జీవితంలో భాగమైపోయాయి. అయితే సాంకేతికత మనిషికి సౌకర్యం కల్పించాలి తప్ప.. మనిషి జీవితాన్నే నియంత్రించే స్థాయికి చేరకూడదు.ఇప్పటి కుటుంబాల్లో ఒకే ఇంట్లో ఉంటూ కూడా ఒకరితో ఒకరు మాట్లాడుకోవడానికి సమయం లేకపోవడం ఆందోళన కలిగించే విషయం. భోజనం చేసే సమయంలోనూ మొబైల్, విశ్రాంతి సమయంలోనూ మొబైల్, ప్రయాణంలోనూ మొబైల్.. ఇలా ప్రతి ఖాళీ క్షణాన్ని తెర ఆక్రమిస్తోంది. సాంకేతికత మనలను ప్రపంచంతో అనుసంధానిస్తున్నప్పటికీ.. మన పక్కనే ఉన్న మనుషుల నుంచి దూరం చేస్తే దాని ప్రయోజనం ఎంత అన్నది ఆలోచించాలి.

సంబంధాలకు సమయం కేటాయించాలి

కుటుంబ సంబంధాలు కేవలం ఒకే ఇంట్లో నివసించడం వల్ల బలపడవు. మాట్లాడుకోవడం, ఒకరి మాటను మరొకరు వినడం, కష్టసుఖాలను పంచుకోవడం ద్వారా అనుబంధం పెరుగుతుంది. తల్లిదండ్రులు, పిల్లలు రోజులో కొంత సమయం మొబైల్, టీవీలకు దూరంగా కలిసి గడపడం అవసరం. కుటుంబంలో సంభాషణ తగ్గితే చిన్న సమస్యలు కూడా పెద్ద అపార్థాలుగా మారే ప్రమాదం ఉంది.పిల్లలకు ఖరీదైన వస్తువులు కొనివ్వడం కంటే వారితో మాట్లాడటానికి సమయం కేటాయించడం ఎక్కువ విలువైనది. వారి చదువు, స్నేహాలు, ఆసక్తులు, భయాలు గురించి తెలుసుకోవడానికి తల్లిదండ్రులు ముందడుగు వేయాలి. పిల్లలు మాట్లాడేందుకు సిద్ధంగా ఉన్నప్పుడు వినే పెద్దలు ఇంట్లో ఉండాలి.

సోషల్ మీడియా వినియోగంపై నియంత్రణ అవసరం

సోషల్ మీడియా సమాచారాన్ని వేగంగా అందించడంతో పాటు ప్రపంచంతో అనుసంధానం కల్పిస్తోంది. కానీ అధిక వినియోగం సమయాన్ని హరిస్తోంది. ఇతరుల జీవితాలను చూసి తమ జీవితంతో పోల్చుకోవడం, గుర్తింపు కోసం నిరంతరం పోస్టులు చేయడం, ప్రతి విషయానికీ ఆన్‌లైన్ స్పందన కోసం ఎదురుచూడడం వంటి అలవాట్లు మానసిక ఒత్తిడికి దారితీయవచ్చు. సోషల్ మీడియాను పూర్తిగా మానేయాల్సిన అవసరం లేదు. కానీ దానికి పరిమితి అవసరం. అవసరమైన సమాచారం కోసం ఉపయోగించి, మిగిలిన సమయాన్ని కుటుంబం, స్నేహితులు, పుస్తకాలు, వ్యాయామం, ప్రకృతి వంటి వాటికి కేటాయిస్తే జీవన సమతుల్యత మెరుగుపడుతుంది.

కృత్రిమ మేధస్సు.. అవకాశాలతో పాటు బాధ్యత

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వేగంగా విస్తరిస్తున్న కాలమిది. అనేక పనులను సులభతరం చేసే ఈ సాంకేతికత విద్య, ఉద్యోగం, పరిశోధన, పరిశ్రమలలో కొత్త అవకాశాలను తెస్తోంది. అయితే ప్రతి విషయానికీ యంత్రంపై ఆధారపడటం వల్ల మనిషి స్వతంత్ర ఆలోచనా శక్తి, సృజనాత్మకత తగ్గిపోకుండా జాగ్రత్తపడాలి. సమాచారం లభించడం ఒక విషయం.. దాని నిజానిజాలను అర్థం చేసుకోవడం మరో విషయం. డిజిటల్ యుగంలో అందుకే మీడియా లిటరసీ, సమాచార విశ్లేషణ సామర్థ్యం మరింత అవసరం. ఏ సమాచారం కనిపించినా వెంటనే నమ్మకుండా మూలాన్ని పరిశీలించే అలవాటు ప్రతి పౌరుడికి ఉండాలి.

పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

చిన్నారుల చేతుల్లో స్మార్ట్‌ఫోన్‌లు, ట్యాబ్‌లు ఎక్కువ సమయం ఉండటం వారి అలవాట్లను ప్రభావితం చేసే అవకాశం ఉంది. చదువు పేరుతో పరికరాలు ఇచ్చినప్పటికీ అవి ఇతర వినోదాలకు మళ్లకుండా తల్లిదండ్రులు పర్యవేక్షించాలి. పిల్లలకు ఆటలు, పుస్తకాలు, కళలు, క్రీడలు, బయట ప్రపంచంతో అనుభవం కూడా అవసరం. స్క్రీన్ సమయాన్ని తగ్గించడం అంటే కేవలం ఫోన్ దూరం చేయడం కాదు. దాని స్థానంలో ఆసక్తికరమైన ప్రత్యామ్నాయాలు కల్పించాలి. కుటుంబంతో కలిసి ఆటలు ఆడటం, కథలు చదవడం, బయటకు వెళ్లడం వంటి అలవాట్లు పిల్లల సమగ్ర అభివృద్ధికి దోహదం చేస్తాయి.

డిజిటల్ భద్రతను విస్మరించకూడదు

సాంకేతిక వినియోగం పెరిగినకొద్దీ వ్యక్తిగత సమాచార భద్రత కూడా ముఖ్యమవుతోంది. పాస్‌వర్డ్‌లు, బ్యాంకింగ్ వివరాలు, వ్యక్తిగత ఫొటోలు, గుర్తింపు పత్రాల సమాచారం వంటి వాటిని నిర్లక్ష్యంగా పంచుకోవడం ప్రమాదకరం. అనుమానాస్పద లింకులు, మోసపూరిత సందేశాలు, తప్పుడు కాల్స్‌పై అప్రమత్తంగా ఉండాలి. డిజిటల్ సదుపాయాలు ఎంత వేగంగా విస్తరిస్తున్నాయో.. వాటిని సురక్షితంగా ఉపయోగించే అవగాహన కూడా అంతే వేగంగా పెరగాలి. పాఠశాలల నుంచే సైబర్ భద్రతపై ప్రాథమిక అవగాహన కల్పించడం అవసరం. సాంకేతికతకు మనమే యజమానులు కావాలి సాంకేతికతను తిరస్కరించడం పరిష్కారం కాదు. దాన్ని తెలివిగా, పరిమితంగా ఉపయోగించడమే సరైన మార్గం. పని వేగంగా పూర్తిచేయడానికి టెక్నాలజీని ఉపయోగించాలి.. కానీ కుటుంబ సమయాన్ని దానికి అప్పగించకూడదు. సమాచారాన్ని పొందాలి.. కానీ ఆలోచనను యంత్రానికి అప్పగించకూడదు. ప్రపంచంతో కలవాలి.. కానీ మనతో ఉన్న మనుషులను మర్చిపోకూడదు. సాంకేతికత మనిషి జీవితానికి సాధనం మాత్రమే.. ప్రత్యామ్నాయం కాదు. యంత్రాలు ఎంత అభివృద్ధి చెందినా ప్రేమ, అనుబంధం, అనుభూతి, మానవత్వాన్ని అవి భర్తీ చేయలేవు. డిజిటల్ ప్రపంచంలో ముందుకు సాగుతూనే మానవ సంబంధాలను కాపాడుకోవాలి. టెక్నాలజీ మన చేతిలో ఉండాలి.. మనిషి టెక్నాలజీ చేతిలో కాదు.

ఓటుకు నోటు కేసులో కీలక మలుపు.. సుప్రీంకోర్టులో స్టీఫెన్‌సన్ ఇంప్లీడ్ పిటిషన్

మొదటి పేజీ తరువాయి)

తన వాదనలను వినడం నిష్పక్షపాత విచారణకు అత్యంత కీలకమని ఆయన తరఫు న్యాయవాది కోర్టుకు నివేదించారు. ఈ ఇంప్లీడ్ పిటిషన్‌ను భారత ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం పరిగణనలోకి తీసుకుంటూ, తదుపరి విచారణను వాయిదా వేసింది.2015 జూన్‌లో జరిగిన తెలంగాణ శాసనమండలి ఎన్నికల సందర్భంగా ఈ ఉదంతం వెలుగులోకి వచ్చింది. టీడీపీ అభ్యర్థికి అనుకూలంగా ఓటు వేసేందుకు అప్పటి టీడీపీ ఎమ్మెల్యే రేవంత్ రెడ్డి (ప్రస్తుత తెలంగాణ ముఖ్యమంత్రి) రూ. 50 లక్షలు అడ్వాన్స్‌గా ఇచ్చేందుకు ప్రయత్నించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంలో తెలంగాణ ఏసీబీ కేసు నమోదు చేసి రేవంత్ రెడ్డి సహా ముగ్గురిని అరెస్ట్ చేయడంతో పాటు నగదును స్వాధీనం చేసుకుంది. ఈ కేసులో ఆడియో, వీడియో రికార్డింగులను కీలక ఆధారాలుగా పేర్కొన్నారు.తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని కోరుతూ రేవంత్ రెడ్డి ఇప్పటికే సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ క్వాష్ పిటిషన్‌పై విచారణ జరుగుతున్న తరుణంలో స్టీఫెన్‌సన్ ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. తాజా పరిణామాలతో తెలుగు రాష్ట్రాల రాజకీయ, న్యాయ వర్గాల్లో ఈ కేసు మరోసారి చర్చనీయాంశంగా మారింది. తదుపరి విచారణలో ధర్మాసనం ఎలాంటి నిర్ణయం తీసుకోనుందోనన్న ఉత్కంఠ నెలకొంది.

భారత్–అమెరికా వాణిజ్య చర్చలపై నిర్మలా సీతారామన్ కీలక వ్యాఖ్యలు

మొదటి పేజీ తరువాయి)

నష్టం జరుగుతోందన్న అమెరికా ఆందోళన ఈ చర్చల్లో స్పష్టంగా ప్రతిబింబిస్తోందని ఆమె తెలిపారు. ఫిబ్రవరి 2026లో ప్రకటించిన మధ్యంతర వాణిజ్య ఒప్పంద ముసాయిదా ప్రాతిపదికన ఈ చర్చలు కొనసాగుతున్నాయి.ఇదే క్రమంలో భారత్–యూరోపియన్ యూనియన్ (ఈయూ) మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందాన్ని ఆమె ఒక విజయవంతమైన ఉదాహరణగా పేర్కొన్నారు. యూరోపియన్ కమిషన్ ప్రెసిడెంట్ అభివర్ణించినట్లుగా ఇది ‘తల్లి లాంటి ఒప్పందం’ అని ఆమె కొనియాడారు. ఈ ఒప్పందంలో భాగంగా భారత్ 92.5 శాతం టారిఫ్ లైన్లను, 97 శాతం వాణిజ్య విలువను అందుబాటులోకి తెస్తే, ఈయూ తన వైపు నుంచి 97 శాతం టారిఫ్ లైన్లను, 99 శాతం వాణిజ్య విలువను విముక్తం చేసిందని ఆమె వివరించారు.

రామప్పను కాపాడేందుకు పెద్దఎత్తున ఉద్యమిస్తాం: కేటీఆర్

మొదటి పేజీ తరువాయి)

ఓపెన్ కాస్ట్ బొగ్గు గని ఏర్పాటు చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమవడం దారుణమని కేటీఆర్ మండిపడ్డారు. మీటర్ల కొద్ది లోతులో తవ్వకాలు, బ్లాస్టింగ్స్ చేయడం వల్ల తెలంగాణ శిల్పకళకు ప్రతిరూపం, యునెస్కో ద్వారా ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన రామప్ప దేవాలయానికి, రామప్ప చెరువుకు తీవ్ర ముప్పు వాటిల్లనుందని హెచ్చరించారు. వారసత్వ సంపదను ధ్వంసం చేసే ఈ కుట్రలను బీఆర్ఎస్ పార్టీ వ్యతిరేకిస్తుందని పేర్కొన్నారు. ప్రఖ్యాత రామప్ప దేవాలయానికి హాని చేసే ఓపెన్ కాస్ట్ బొగ్గు గని ప్రతిపాదనను వెంటనే వెనక్కి తీసుకోకుంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని కేటీఆర్ హెచ్చరించారు.

సన్న బియ్యం ధరలపై హరీశ్ ఫైర్.. నాలుగు నెలల్లో 25 శాతం పెరిగాయంటూ విమర్శలు

మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వంలో ఎందుకు చలనం లేదు? బియ్యం మాత్రమే కాదు.. ఉల్లి రూ.70, వెల్లుల్లి రూ.240, పల్లినూనె రూ.210, పెసరపప్పు రూ.125, కందిపప్పు రూ.165 ధరలు అడ్డగోలుగా పెరిగితే సామాన్య కుటుంబం ఎలా బతకాలి? వంటింటి బడ్జెట్ తారుమారవుతున్నా.. పౌరసరఫరాల శాఖ ఏం చేస్తోంది? ధరల పర్యవేక్షణ గాలికి ప్రభుత్వం ఏం చేస్తున్నట్లు? ప్రజల జేబులు ఖాళీ అవుతుంటే ప్రభుత్వం ప్రేక్షక పాత్ర పోషించడం కాదు.. వెంటనే చర్యలు తీసుకోవాలి. బ్లాక్ మార్కెట్, అక్రమ నిల్వలు, కృత్రిమ కొరత, అధిక మార్జిన్లపై తక్షణం నిఘీలు నిర్వహించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు.. సన్నబియ్యం సహా నిత్యావసరాల ధరలకు వెంటనే అడ్డుకట్ట వేసి, సామాన్యుడిపై పడుతున్న భారం నుంచి ఉపశమనం కల్పించాలని డిమాండ్ చేస్తున్నాం’ అంటూ ఎక్స్‌లో హరీశ్ రావు పోస్ట్ చేశారు.

ఫామ్-6 మార్పులు.. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌పై రాహుల్ గాంధీ ఆరోపణలు..

మొదటి పేజీ తరువాయి)

చట్టవిరుద్ధంగా, ఏకపక్షంగా మార్చారని ఆరోపించారు. ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ తన పదవిని దుర్వినియోగం చేసి బీజేపీకి ప్రయోజనం కలిగించేలా వ్యవహరిస్తున్నారని రాహుల్ గాంధీ ఆరోపించారు. ఈ వ్యవహారంలో భాగమైన వారందరినీ బాధ్యులను చేస్తామని ఆయన పేర్కొన్నారు . మరోవైపు, ముగ్గురు ఎన్నికల కమిషనర్ల సమ్మతి లేకుండా ఎన్నికల సంఘంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారన్న పిటిషన్లపై సుప్రీంకోర్టు ఎన్నికల సంఘానికి, కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. ఎన్నికల సంఘం నిర్ణయాలు ఏకగ్రీవంగా లేదా మెజారిటీతో తీసుకున్నవా, లేక ఒక్క సీఈసీ మాత్రమే నిర్ణయించారా అనే వివరాలను కోర్టు కోరింది.

ఫ్యూచర్ సిటీలో విదేశీ వర్సిటీల క్యాంపస్‌లు.. ప్రత్యేక పాలసీకి తెలంగాణ సర్కార్ ప్లాన్

మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. తెలంగాణను అంతర్జాతీయ విద్యా కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా చర్యలు వేగవంతం చేయాలని సూచించారు.ఇప్పటికే యూనివర్సిటీ ఆఫ్ లండన్, యూనివర్సిటీ ఆఫ్ బర్మింగ్‌హామ్‌తో పాటు మరో నాలుగు అంతర్జాతీయ యూనివర్సిటీలు ఫ్యూచర్ సిటీలో క్యాంపస్‌లు ఏర్పాటు చేసేందుకు ఆసక్తి చూపినట్లు అధికారులు సీఎస్‌కు తెలిపారు.విదేశీ వర్సిటీలను ఆహ్వానించడం, అవసరమైన మౌలిక వసతులు కల్పించడం, పెట్టుబడులకు అవకాశం కల్పించడం, అనుమతులు సులభతరం చేయడం, విద్యా కార్యక్రమాల నిర్వహణ వంటి అంశాలను పాలసీలో చేర్చాలని సంజయ్ జాజు సూచించారు. తెలంగాణ విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో విద్య, పరిశోధన, నైపుణ్యాభివృద్ధి అవకాశాలు అందేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు.ప్రతిపాదిత వర్సిటీల ప్రతినిధులతో చర్చలు జరిపి స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. త్వరలో జరగనున్న గ్లోబల్ సమ్మిట్ నాటికి ఈ ప్రణాళిక సిద్ధంగా ఉండాలని సూచించారు.ఇదే సమావేశంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్మిస్తున్న ‘యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్’పైనా సమీక్షించారు. రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో దశలవారీగా ఈ పాఠశాలలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. 2027 డిసెంబర్ నాటికి 67 పాఠశాలలను పూర్తి చేయాలని, 2028 జూన్ నాటికి ఈ సంఖ్యను 87కి పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.ఒక్కో పాఠశాలను సుమారు 26 ఎకరాల్లో నిర్మించనున్నారు. క్రీడా మైదానాలు, హాస్టళ్లు, సిబ్బంది క్వార్టర్లు, ఆధునిక వంటశాలలు, డిజిటల్ తరగతి గదుల వంటి సదుపాయాలు కల్పించనున్నారు. నిర్మాణ పనులను క్రమం తప్పకుండా సమీక్షించి, నాణ్యతతో నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని సీఎస్ ఆదేశించారు.

పవన్ కల్యాణ్ ఆదేశాలతో ఇంద్రకీలాద్రిపై ప్రధాని మోదీ పేరిట పూజలు

మొదటి పేజీ తరువాయి)

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజా ప్రస్థానాన్ని పూర్తి చేసుకుంటున్న చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకుని విజయవాడ ఇంద్రకీలాద్రిపై ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అక్టోబర్ 7వ తేదీన శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో ప్రధాని మోదీ పేరిట ఈ పూజా కార్యక్రమాలను చేపట్టనున్నారు. ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు రాజ్యసభ సభ్యులు లింగమనేని రమేశ్ ఈ పూజలను నిర్వహిస్తున్నారు.2001లో గుజరాత్ ముఖ్యమంత్రిగా ప్రధాని మోదీ ప్రజా ప్రస్థానం ప్రారంభమైంది. అప్పటి నుంచి 2014లో దేశ ప్రధానిగా బాధ్యతలు చేపట్టి, 25 ఏళ్లుగా తన సేవలను దిగ్విజయంగా కొనసాగిస్తున్నారు. ఈ మైలురాయిని పురస్కరించుకుని, ప్రధాని మోదీకి అమ్మవారి సంపూర్ణ ఆశీస్సులు లభించాలని, ఆయనకు ఆయురారోగ్యాలు, దీర్ఘాయుష్షు ప్రసాదించాలని ఆకాంక్షిస్తూ ఈ పూజలు జరపనున్నారు. దేశాన్ని ‘వికసిత్ భారత్’ లక్ష్యం వైపు నడిపిస్తున్న ఆయన నాయకత్వం మరింత బలోపేతం కావాలన్నది ఈ పూజల ముఖ్య ఉద్దేశం.ఈ సందర్భంగా అక్టోబర్ 7వ తేదీ తెల్లవారుజామున బ్రహ్మ ముహూర్తంలో అమ్మవారి అంతరాలయంలో అత్యంత విశిష్టమైన ‘ఖడ్గమాల అర్చన’ను ప్రధాని పేరిట జరపనున్నారు. జగద్గురువు ఆదిశంకరాచార్యులు ఇంద్రకీలాద్రిపై ప్రతిష్ఠించిన శ్రీచక్రానికి ఖడ్గమాల స్తోత్రంతో పూజలు నిర్వహిస్తే అమ్మవారి అనుగ్రహంతో పాటు ఆధ్యాత్మిక శక్తి, రక్షణ, శాంతి, సంకల్పసిద్ధి కలుగుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ప్రధాని మోదీ నిరంతర దేశ సేవకు కనకదుర్గమ్మ ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని, ఆయన నాయకత్వంలో భారతదేశం మరింత సుసంపన్నమైన, ఆత్మనిర్భర దేశంగా ఎదగాలన్న సంకల్పంతో ఎంపీ లింగమనేని రమేశ్ ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ పూజల ద్వారా ప్రధానికి సంపూర్ణ ఆరోగ్యం, శక్తి సామర్థ్యాలు లభించాలని ఆకాంక్షించారు.

విజయ కెరటం
తెలుగు దినపత్రిక
అక్టోబర్ | మంగళవారం | 6 | 2026

ప్రజావాణి ఫిర్యాదుల పెండెన్సీ తగ్గించాలి: కలెక్టర్ చంద్రశేఖర్





నల్గొండ, అక్టోబర్ 5 (విజయ కెరటం):

అన్ని స్థాయిల్లో ప్రజావాణి ఫిర్యాదుల పెండెన్సీని తగ్గించి, ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన జిల్లా అధికారులతో కలిసి ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. మండల, డివిజన్ స్థాయిల్లో స్థానిక సంస్థలు, రెవెన్యూ శాఖలకు సంబంధించిన ఫిర్యాదులు ఎక్కువగా పెండింగ్‌లో ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. వాటిపై ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి దశరథ్, స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ (ప్రేమ్ కరణ్ రెడ్డిని ఆదేశించారు.జిల్లా అధికారులు హాస్టళ్లను తప్పనిసరిగా తనిఖీ చేసి నివేదికలు సమర్పించాలని, ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 11 అంశాల్లో సాధించిన లక్ష్యాలపై ఈ నెల 6లోగా నివేదిక ఇవ్వాలని సూచించారు. త్వరలో నిర్వహించనున్న దిశ సమావేశానికి కూడా సంబంధిత నివేదికలను సిద్ధం చేయాలన్నారు. ప్రజాప్రతినిధులు, సీఎం కార్యాలయం, వీఐపీలు, చీఫ్ సెక్రటరీ, ప్రజావాణి, సీపీఆర్ఓ ద్వారా వచ్చిన రిఫరెన్సులపై తీసుకున్న చర్యలను రాతపూర్వకంగా తెలియజేయాలని ఆదేశించారు. సెప్టెంబర్ నెల పర్యటన వివరాలను వెంటనే సమర్పించాలని, వార్తాపత్రికల్లో ప్రచురితమయ్యే ప్రతికూల వార్తలపై సంబంధిత శాఖల అధికారులు వెంటనే స్పందించి, తీసుకున్న చర్యలు లేదా వివరణను సమర్పించాలని స్పష్టం చేశారు.ఆర్టీఐ దరఖాస్తులను పారదర్శకంగా పరిష్కరించాలి అక్టోబర్ 5 నుంచి 12 వరకు సమాచార హక్కు చట్టంపై అవగాహన వారోత్సవాలు నిర్వహిస్తున్న సందర్భంగా, అధికారుల వద్ద పెండింగ్‌లో ఉన్న ఆర్టీఐ దరఖాస్తులు, అప్పీల్ దరఖాస్తుల వివరాలను నిర్దేశిత ప్రొఫార్మాలో సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ఆర్టీఐ కింద వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు పారదర్శకంగా పరిష్కరించాలని సూచించారు. అనంతరం సమాచార హక్కు చట్టంపై రూపొందించిన ప్రతిజ్ఞను అధికారులతో చేయించారు.పత్తి, ధాన్యం కొనుగోళ్లకు సిద్ధంగా ఉండాలిత్వరలో ప్రారంభం కానున్న పత్తి, ధాన్యం సేకరణకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయడంతోపాటు, కొనుగోలు ప్రక్రియను పర్యవేక్షించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. నీటి సంరక్షణపై ప్రత్యేక దృష్టి ఎల్‌నినో ప్రభావంతో భూగర్భ జలాలను అధికంగా వినియోగించే ప్రాంతాల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో నీటిని పొదుపుగా వినియోగించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో ఎక్కడైనా తాగునీటి పైప్‌లైన్ లీకేజీలు ఉంటే వెంటనే అరికట్టాలని, వర్షపు నీటి సంరక్షణ చర్యలు చేపట్టాలని, ప్రజల్లో నీటి పొదుపుపై విస్తృతంగా అవగాహన కల్పించాలని అన్నారు. గ్రామాల్లో తాగునీటి కొరత ఏర్పడితే అవసరమైన చోట నీటి వనరులను అద్దెకు తీసుకునేలా చర్యలు చేపట్టాలని సూచించారు. వాల్వా అనుమతులు లేకుండా కొత్త బోర్లకు అనుమతులు మంజూరు చేయవద్దని ఆదేశించారు.చేయూత పెన్షన్ దరఖాస్తులను పరిశీలించి ఈ నెల 8లోగా పంపించాలని అధికారులకు సూచించారు.141 ఫిర్యాదులు స్వీకరణ ఈ సోమవారం ప్రజావాణిలో రెవెన్యూ శాఖకు సంబంధించిన 55, ఇతర శాఖలకు సంబంధించిన 86, మొత్తం 141 దరఖాస్తులను ప్రజలు సమర్పించారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, శిక్షణ సహాయ కలెక్టర్ ఎన్. శ్రీకాంత్ రెడ్డి, డీఆర్‌డీఓ శేఖర్ రెడ్డి, డీఆర్ఓ దశరథ్, ఇతర జిల్లా అధికారులు ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు.

పోలీస్ విధుల్లో పారదర్శకతకు పెద్దపీట

- **అవినీతికి తావులేకుండా క్రమశిక్షణతో విధులు నిర్వహించాలి: ఎస్పీ శరత్ చంద్ర పవార్**

నల్గొండ, అక్టోబర్ 5 (విజయ కెరటం):



పోలీస్ విధుల్లో పారదర్శకత, క్రమశిక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, అవినీతికి ఏమాత్రం తావులేకుండా నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్ పోలీస్ అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. ప్రజలకు పోలీస్ శాఖపై ఉన్న నమ్మకాన్ని మరింత బలోపేతం చేసేలా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా, అంకితభావంతో పనిచేయాలని సూచించారు.సోమవారం పోలీస్ అధికారులు, ఎస్‌హెచ్ఓలు, ఇతర అధికారులు, సిబ్బందితో ఎస్పీ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో శాంతిభద్రతలు, నేర నియంత్రణ, రాత్రి గస్తీ, వాహనాల తనిఖీలు, చెక్‌పోస్టులు, ఎన్‌ఫోర్స్‌మెంట్, ర్యాలీలు, ప్రజా భద్రత, విలేజ్ పోలీసింగ్, సిబ్బంది సంక్షేమం తదితర అంశాలపై సమీక్షించారు.పోలీస్ విధుల్లో రాజకీయ, వ్యక్తిగత లేదా ఇతర ప్రభావాలకు తావులేకుండా చట్టప్రకారం అందరికీ సమానంగా న్యాయం జరిగేలా వ్యవహరించాలని ఎస్పీ స్పష్టం చేశారు. వాహనాల తనిఖీలు, చెక్‌పోస్టులు, రాత్రి పెట్రోలింగ్, ఎన్‌ఫోర్స్‌మెంట్, కేసుల దర్యాప్తు వంటి విధుల్లో సిబ్బంది డబ్బులు తీసుకున్నారనే ఆరోపణలు లేదా సమాచారం వస్తే తీవ్రంగా పరిగణిస్తామని హెచ్చరించారు.జిల్లాలో పగలు, రాత్రి నిరంతరం పెట్రోలింగ్ నిర్వహిస్తూ అక్రమ, అసాంఘిక కార్యకలాపాలపై నిఘా ఉంచాలని ఆదేశించారు. ముఖ్యంగా రాత్రి విధుల్లో ఉన్న సిబ్బంది అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలు, కార్యకలాపాలను గుర్తించి అవసరమైన చోట వెంటనే చట్టపరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో విలేజ్ పోలీస్ ఆఫీసర్ల ద్వారా గ్రామస్థాయిలో సమాచారాన్ని ముందుగానే సేకరించాలని, నేరాలు, అక్రమ కార్యకలాపాలు, శాంతిభద్రతలకు సంబంధించిన సమస్యలను గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని ఎస్పీ సూచించారు. ఎస్‌హెచ్ఓలు తమ పరిధిలోని గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించి విలేజ్ పోలీస్ ఆఫీసర్లతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు.విధి నిర్వహణలో యూనిఫామ్, డ్రెస్ కోడ్, ప్రవర్తనా నియమాలు, క్రమశిక్షణ తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. విధుల్లో నిర్లక్ష్యం, అలసత్వం, క్రమశిక్షణా రాహిత్యాన్ని ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. ప్రజలకు అందుబాటులో ఉండే, బాధ్యతాయుతమైన, అవినీతి రహితమైన, పారదర్శకమైన పోలీసింగ్ అందించడమే లక్ష్యంగా ప్రతి అధికారి, సిబ్బంది నిజాయితీ, నిబద్ధతతో విధులు నిర్వహించాలని ఎస్పీ శరత్ చంద్ర పవార్ సూచించారు.వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లాలోని పోలీస్ అధికారులు, ఎస్‌హెచ్ఓలు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రజా ఫిర్యాదులపై సత్వర స్పందన.. బాధితులకు న్యాయం చేయాలి: ఎస్పీ శరత్ చంద్ర పవార్

నల్గొండ, అక్టోబర్ 5 (విజయ కెరటం):

ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై సత్వర స్పందించి, బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ అధికారులను ఆదేశించారు.సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన పోలీస్ గ్రీవెన్స్ డే కార్యక్రమంలో ఎస్పీ శరత్ చంద్ర పవార్ జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధి నుంచి వచ్చిన సుమారు 53 మంది బాధితుల సమస్యలు, ఫిర్యాదులను స్వయంగా విని వివరాలు తెలుసుకున్నారు.ఈ సందర్భంగా బాధితులు భూ వివాదాలు, కుటుంబ సమస్యలు, ఆర్థిక లావాదేవీలు, మోసాలు, ఆస్తి వివాదాలు తదితర అంశాలపై ఫిర్యాదులు సమర్పించారు. ప్రతి ఫిర్యాదును పరిశీలించిన ఎస్పీ సంబంధిత పోలీస్ అధికారులు, సిబ్బందితో మాట్లాడి సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై ఆదేశాలు జారీ చేశారు.ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను నిర్ధారించిన అనంతరం చట్టపరమైన నిబంధనల ప్రకారం సత్వర చర్యలు తీసుకోవాలని సూచించారు. ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి జాప్యం చేయకుండా, ప్రతి కేసు పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు.ప్రజలు నమ్మకంతో పోలీస్ శాఖను ఆశ్రయిస్తున్నందున వారి ఫిర్యాదులను గౌరవంగా స్వీకరించి, నిష్పక్షపాతంగా విచారణ జరిపి బాధితులకు న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించడం పోలీస్ శాఖ ప్రధాన బాధ్యత అని తెలిపారు.గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా జిల్లా ఎస్పీని కలిసి తమ సమస్యలను వివరించే అవకాశం కల్పిస్తున్నామని, ప్రతి ఫిర్యాదును ప్రాధాన్యతతో పరిశీలించి చట్ట పరిధిలో సత్వర పరిష్కారం అందించేందుకు చర్యలు తీసుకుంటామని ఎస్పీ శరత్ చంద్ర పవార్ తెలిపారు.



జర్నలిస్టులకు ఏఐ, సోషల్ మీడియాపై వర్క్‌షాప్

ఈనెల 12న నాగార్జునసాగర్‌లో శిక్షణ.. 8లోగా పేర్లు నమోదు చేసుకోవాలి

నల్గొండ, అక్టోబర్ 5 (విజయ కెరటం):

నాగార్జునసాగర్, పరిసర ప్రాంతాల వర్కింగ్ జర్నలిస్టుల కోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), సోషల్ మీడియాపై ఒకరోజు వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు రాష్ట్ర మీడియా అకాడమీ కార్యదర్శి ఎన్. వెంకటేశ్వరరావు తెలిపారు. ఈనెల 12న నాగార్జునసాగర్ హిల్ కాలనీలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఈ శిక్షణ కార్యక్రమం కొనసాగనుంది.ఏఐ, సోషల్ మీడియా రంగాల్లో నిష్ణాతులైన రిసోర్స్ పర్సన్లు హాజరై జర్నలిస్టులకు వివిధ అంశాలపై శిక్షణ అందించనున్నారు. ఈ వర్క్‌షాప్‌కు హాజరు కావాలనుకునే నాగార్జునసాగర్, పరిసర ప్రాంతాల జర్నలిస్టులు ఈనెల 8లోగా నల్గొండ కలెక్టరేట్ ఆవరణలోని జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయంలో సహాయ సంచాలకుల వద్ద తమ పేర్లను నమోదు చేసుకోవాలని అధికారులు సూచించారు.వర్క్‌షాప్‌లో 75 మందికి మించకుండా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. నాగార్జునసాగర్, పరిసర ప్రాంతాల వర్కింగ్ జర్నలిస్టులకు ప్రాధాన్యత ఉంటుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర మీడియా అకాడమీ కార్యదర్శి కోరారు.

జెడ్పీ సీఈఓల నూతన అసోసియేషన్ సభ్యుల మర్యాదపూర్వక భేటీ

నల్గొండ, అక్టోబర్ 5 (విజయ కెరటం):



ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయి జిల్లా పరిషత్ సీఈఓలు, డిప్యూటీ సీఈఓల ఎన్నికల్లో విజయం సాధించిన నూతన అసోసియేషన్ సభ్యులు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ దివ్యను సోమవారం ఆమె చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు పుష్పగుచ్ఛం అందజేశారు.స్థానిక సంస్థల ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్, జెడ్పీ సీఈఓ ప్రేమ్ కరణ్ రెడ్డి ఈ విషయాన్ని ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం అడిషనల్ కమిషనర్ రవీందర్‌ను కూడా నూతన అసోసియేషన్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసినట్లు ఆయన పేర్కొన్నారు.

ఎస్ఐ, పీసీ ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఎస్ఐ, పీసీ ఉచిత రెసిడెన్షియల్ శిక్షణ

నల్గొండ, అక్టోబర్ 5 (విజయ కెరటం):

సబ్-ఇన్‌స్పెక్టర్ (SI), పోలీస్ కానిస్టేబుల్ (PC) ప్రిలిమినరీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థుల కోసం ఉచిత రెసిడెన్షియల్ శిక్షణకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి బి. శశికళ తెలిపారు.తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో నల్గొండ, యాదాద్రి-భువనగిరి జిల్లాలకు చెందిన 100 మంది అభ్యర్థులకు ఉచిత శిక్షణ అందించనున్నట్లు పేర్కొన్నారు. డిగ్రీ లేదా పీజీ పూర్తి చేసిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ నిరుద్యోగ అభ్యర్థులు అక్టోబర్ 6 నుంచి 8వ తేదీ వరకు ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.దరఖాస్తులను ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నల్గొండలోని గాయత్రి నగర్ కాలనీలో, హైదరాబాద్ రోడ్డులోని శ్రీ సాయి భారతి డిగ్రీ కాలేజీ రెండో అంతస్తులో ఉన్న TGSC స్టడీ సర్కిల్‌లో సమర్పించాలి. అభ్యర్థుల ఎంపిక స్టడీ సర్కిల్ రిజర్వేషన్ నిష్పత్తి ప్రకారం డిగ్రీ మార్కుల మెరిట్ ఆధారంగా జరుగుతుంది. అభ్యర్థులు SI/PC రిజిస్ట్రేషన్ ఫారంతో పాటు పదో తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ, టీసీ, కులం, ఆదాయం, నివాస ధ్రువీకరణ పత్రాలు, పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు సమర్పించాలి. ఇప్పటికే తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల స్టడీ సర్కిల్‌లో 5 నెలల ఫౌండేషన్ కోర్సులో శిక్షణ పొందుతున్న వారిలో SI, PC పరీక్షలకు అర్హత ఉన్న అభ్యర్థుల శిక్షణ కాలాన్ని కూడా పొడిగించనున్నట్లు తెలిపారు.ఈ శిక్షణ కార్యక్రమం అక్టోబర్ 12 నుంచి డిసెంబర్ 20, 2026 వరకు కొనసాగుతుంది. ఇతర వివరాల కోసం 8465035932, 9603167257, 9010895239 నంబర్లను సంప్రదించవచ్చు.

దుర్గామాత ఉత్సవ కమిటీ అధ్యక్షుడుగా నాగిళ్ళ వేణు శర్మ

హన్మకొండ విజయకేరటం ప్రతినిధి అక్టోబర్5



భీమారం 55 వ డివిజన్ భద్రకాళినగర్ రోడ్ 2లో దుర్గామాత ఉత్సవ కమిటీ ఎన్నిక. అధ్యక్షులు గా నాగిళ్ళ వేణు శర్మ , కోశాధికారి గా సందీప్ ప్రధాన సభ్యులుగా వేణు, మలహల్ రావు, జలిగం తిరుపతి, కుమ్మరి వెంకటేశ్వర్లు, ఆరే శ్రీకాంత్ రెడ్డి, చెప్పాల రవికుమార్, పంజాల రామకృష్ణ ఎన్నికైనట్లు కాలనీ లో దుర్గామాత ఉత్సవం అత్యంత భక్తి శ్రద్ధలతో చేయనున్నట్లు , కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు విజయకుమార్ తెలిపారు. విగ్రహదాత వంగర రవీందర్ కాలనీ పెద్దలు, శ్రీనివాసరెడ్డి , సంపత్ రెడ్డి, సుధీర్ రెడ్డి,మిత్రబృందం,కాలనీవాసులు పాల్గొన్నట్లు తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం అశోక్ సార్‌దే!

మరోసారి బరిలోకి పాలకూరి అశోక్.. ప్రధాన పార్టీలకు సవాల్

నల్గొండ, అక్టోబర్ 5 (విజయ కెరటం):



ఖమ్మం--వరంగల్--నల్గొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా మరోసారి బరిలో నిలుస్తున్నట్లు పాలకూరి అశోక్ ప్రకటించారు. సోమవారం నల్గొండ పట్టణంలోని ఎస్‌పీఆర్ గార్డెన్స్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన తన అభ్యర్థిత్వాన్ని ప్రకటిస్తూ.. ఈసారి విజయం తనదేనని ధీమా వ్యక్తం చేశారు. గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో 30 వేల మొదటి ప్రాధాన్యత ఓట్లు, 90 వేల రెండో ప్రాధాన్యత ఓట్లు సాధించి ప్రధాన పార్టీలకు గట్టి సవాల్ విసిరానని అశోక్ తెలిపారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రధాన పార్టీలు సామాజిక న్యాయాన్ని విస్మరిస్తున్నాయని విమర్శించారు. “ఓట్లు మావి.. సీట్లు మీవా?” అంటూ ప్రశ్నించారు.గత 15 ఏళ్లుగా నిరుద్యోగులు, తెలంగాణ సమాజం కోసం పోరాడుతున్నానని అశోక్ పేర్కొన్నారు. తనపై పలు కేసులు నమోదైనా, మూడు సార్లు ఆమరణ నిరాహార దీక్షలు చేసినా నిరుద్యోగుల పక్షాన నిలిచానన్నారు. ఆన్‌లైన్ ద్వారా లక్షలాది మందికి తక్కువ ఫీజుతో, ఉచితంగా విద్యాబోధన అందించానని తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చి, ఇప్పటివరకు తగిన స్థాయిలో ఉద్యోగాలు కల్పించలేదని విమర్శించారు. పవర్ సెక్టార్‌లో 5,300 ఉద్యోగాలకు ఆర్థిక శాఖ ఆమోదం లభించినా నోటిఫికేషన్ ఇవ్వలేదని, 25 వేల ఉద్యోగాలతో మెగా డీఎస్సీ ప్రకటించినా అమలు కనిపించడం లేదన్నారు. గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3 ఉద్యోగాల నోటిఫికేషన్లు విడుదల చేసిన తర్వాతే ఎన్నికలకు వెళ్లాలని డిమాండ్ చేశారు.తెలంగాణ బిడ్డలకు ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించడమే తన ప్రధాన ఎన్నికల నినాదమని అశోక్ ప్రకటించారు. 33 జిల్లాల్లో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు ఏర్పాటు చేసి నిరుద్యోగులను ఉద్యోగులుగా తీర్చిదిద్దాలని కోరారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంతో పాటు పీఆర్సీ, డీఏల పెండింగ్ అంశాలపై ప్రభుత్వం దృష్టి సారించాలని అన్నారు.సామాజిక తెలంగాణ సాధన కోసం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలు ఐక్యంగా నిలవాలని పిలుపునిచ్చారు. బడ్జెట్‌లో విద్యకు 18 శాతం నిధులు కేటాయించి, విద్య, వైద్యాన్ని పూర్తిగా ఉచితంగా అందించినప్పుడే సామాజిక తెలంగాణ సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో కె.వి. గౌడ్, ప్రణీత్, నవీన్ రెడ్డి, కిరణ్, రవి, కొండల్, మహేష్, సురేష్, సంధ్య, ఇందు తదితరులు పాల్గొన్నారు.

విజయకెరటం
తెలుగు దినపత్రిక

ఆర్టీఐ చట్టం ఆవిర్భావ దినోత్సవ సదస్సు.. కరపత్రం విడుదల

నల్గొండ, అక్టోబర్ 5 (విజయ కెరటం):



సమాచార హక్కు పరిరక్షణ సమితి, ఎలక్షన్ వాచ్ కమిటీ ఆధ్వర్యంలో జాతీయ చైర్మన్ డాక్టర్ బొమ్మరబోయిన కేశవులు ముదిరాజ్ నేతృత్వంలో అక్టోబర్ 12న హైదరాబాద్ సోమాజిగూడలోని ప్రెస్ క్లబ్‌లో సమాచార హక్కు చట్టం--2005 ఆవిర్భావ దినోత్సవ సదస్సు నిర్వహించనున్నారు. నదస్సుకు సంబంధించిన కరపత్రాన్ని నల్గొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, ఐఏఎస్ సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టంపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు ఓటర్లను చైతన్యపరిచేందుకు సంస్థ చేస్తున్న కార్యక్రమాలను అభినందించారు. డాక్టర్ బొమ్మరబోయిన కేశవులు ముదిరాజ్ చేస్తున్న సేవలను ప్రశంసించారు.కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపిన డాక్టర్ కేశవులు ముదిరాజ్, హైదరాబాద్‌లో జరగనున్న సదస్సుకు కార్యకర్తలు బాధ్యతగా వ్యవహరించి, ప్రముఖులు పెద్ద సంఖ్యలో హాజరయ్యేలా కృషి చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో సంస్థ ముఖ్య సలహాదారుడు కోట్ల రామలింగయ్య, పుట్ట విజయ్ కుమార్, కర్నాటి యాదగిరి, కాసుల అజయ్ కుమార్, మేకల శ్రీహరి, తాటి నిరంజన్, మామిడి యాదయ్య, గండి రాము, కారింగు శ్రీకాంత్‌తో పాటు కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌సీఐలో ఘనంగా ముగిసిన హిందీ పక్షోత్సవాలు--2026

నల్గొండ, అక్టోబర్ 5 (విజయ కెరటం):



ఎఫ్‌సీఐ నల్గొండ డివిజనల్ కార్యాలయంలో సెప్టెంబర్ 14 నుంచి 30 వరకు నిర్వహించిన హిందీ పక్షోత్సవాలు--2026 ముగింపు కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఎఫ్‌సీఐ నల్గొండ డివిజనల్ మేనేజర్ సువీన్ కుమార్ మాట్లాడుతూ.. హిందీ పక్షోత్సవాల్లో అధికారులు, ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయడం అభినందనీయమన్నారు.కార్యాలయ కార్యకలాపాల్లో హిందీ వినియోగాన్ని మరింత ప్రోత్సహించాలని ఆయన సూచించారు. తెలంగాణ ప్రాంత స్థాయిలోనే కాకుండా జోనల్, జాతీయ స్థాయిలోనూ నల్గొండ జిల్లా అగ్రస్థానంలో నిలిచేలా కృషి చేయాలని పేర్కొన్నారు.సంస్థ ఏజీఎం (QC) డా. రాఘవేంద్ర సింగ్ మాట్లాడుతూ ఉద్యోగుల్లో హిందీ భాషపై ఆసక్తిని పెంపొందించేందుకు నిర్వహించిన వివిధ పోటీలు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని అన్నారు. కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించిన హిందీ విభాగం సిబ్బందిని అభినందించారు. అనంతరం హిందీ పక్షోత్సవాల్లో భాగంగా నిర్వహించిన హిందీ నోటింగ్ అండ్ డ్రాఫ్టింగ్, ఖాళీల పూరణ, వ్యాసరచన, అనువాదం, క్విజ్ తదితర పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ సీనియర్ అధికారి కాసిరెడ్డి, ఉద్యోగులు మమత, షాహిద్, స్వాతి, రాంబాబు, అనిల్, రూప, ఝాన్సీ, యోగిత, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలి ఆర్వం మధుకర్

వరంగల్ విజయకెరటం 05 అక్టోబర్:



పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హులైన పట్టభద్రులంతా ఓటరుగా నమోదు చేసుకోవాలని ఆత్మకూర్ మండల ఎమ్మెల్సీ సమన్వయకర్త ఆర్వం మధుకర్ కోరారు. సోమవారం ఆత్మకూర్ మండలం నీరుకుళ్లలో పట్టభద్రులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.గుడెప్పాడ్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కాంతాల కేశవరెడ్డి మాట్లాడుతూ, మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆదేశాల మేరకు పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియపై కార్యకర్తలు విస్తృతంగా అవగాహన కల్పించాలని కోరారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకునేలా కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మండల యువజన విభాగం అధ్యక్ష, కార్యదర్శులు వంశీ, మధు, నీరుకుళ్ల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు వంగేటి వేణు, మాజీ సర్పంచ్ ఆర్వం బలరాం, వార్డు సభ్యుడు ఆర్వం రామకృష్ణ, నాయకులు ఈశ్వర్, సుధాకర్, సదయ్య, రాజిరెడ్డి, వీరన్న, యువజన నాయకులు అనిల్, మహమ్మద్, రాకేష్, భిక్షపతి, రాజు, తుప్పరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ స్మార్ట్ రేషన్ కార్డులు ఇవ్వాలి

- **కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన డీసీసీ అధ్యక్షుడు అయూబ్**

వరంగల్ విజయ కెరటం, 05 అక్టోబర్ :



వరంగల్ తూర్పు నియోజకవర్గ పరిధిలో అర్హులైన ప్రతి రేషన్ కార్డు లబ్ధిదారుడికి స్మార్ట్ రేషన్ కార్డులు అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ సోమవారం జిల్లా కలెక్టర్ సత్యశారద దేవికి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా అయూబ్ మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి స్మార్ట్ రేషన్ కార్డు అందేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. అర్హత ఉన్న ఏ ఒక్క లబ్ధిదారుడు కూడా ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరం కాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు.రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియను వేగవంతం చేసి అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి స్మార్ట్ రేషన్ కార్డు అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు. అర్హుల జాబితాను పరిశీలించి, కార్డులు అందని కుటుంబాలకు త్వరితగతిన స్మార్ట్ రేషన్ కార్డులు అందించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు చిలువేరు శ్రీనివాస్, వరంగల్ జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కొరివి పరమేష్, కాంగ్రెస్ నాయకులు మహమ్మద్ కమలుద్దీన్, చాంద్ పాషా తదితరులు పాల్గొన్నారు.

హౌట్‌సోర్సింగ్ వేతన కోతను ఆపాలి





హోదాలు, వేతనాలు యథావిధిగా కొనసాగించాలి

వరంగల్ విజయ కెరటం,05 అక్టోబర్ :

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల హోదాలు, వేతనాలను యథావిధిగా కొనసాగించాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. జీవో, ఆర్ఐఎన్ఓ 1181 ద్వారా ఏర్పడే వేతన కోతను నిలిపివేయాలని కోరుతూ సోమవారం జీడబ్ల్యూఎంసీ కమిషనర్ కార్యాలయం ఎదుట కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, సుదీర్ఘకాలంగా సేవలందిస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాల్లో కోత విధించడం అన్యాయమన్నారు. వేతన కోత నిర్ణయాన్ని ఉపసంహరించుకుని ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరారు.అనంతరం కార్మిక సంఘాల నాయకులు కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏల్పుల ధర్మరాజు, వేల్పుల సారంగపాణి యాదవ్, పాశం రవి యాదవ్, జన్ను ప్రకాష్, కొత్తకొండ శ్రీనివాస్, మేకల దేవేందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అధికారుల తీరుపై ప్రజల ఆగ్రహం





జీడబ్ల్యూఎంసీ ఆర్ఐలు, వార్డు అధికారులపై విమర్శలు


వరంగల్, విజయ కెరటం,05 అక్టోబర్ :

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు డివిజన్లలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు (ఆర్ఐలు), వార్డు అధికారుల పనితీరుపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఆస్తిపన్ను, వ్యాపార అనుమతులు, భవన నిర్మాణ అనుమతులు, నల్లా కనెక్షన్లకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి పలుమార్లు విన్నవించినా స్పందన కొరవడుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులకు ఫోన్ చేసినా స్పందించడం లేదని, కార్యాలయాలకు వెళ్లినా సంబంధిత సిబ్బంది అందుబాటులో ఉండటం లేదని ప్రజలు వాపోతున్నారు. చిన్నచిన్న సమస్యల పరిష్కారం కోసం కూడా పలుమార్లు కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రీవెన్స్ కేంద్రంలో ఫిర్యాదులు చేసినా సకాలంలో పరిష్కారం లభించడం లేదని పేర్కొంటున్నారు.ప్రజా సమస్యల పరిష్కారంలో జాప్యంపై అధికారుల తీరును పలువురు విమర్శిస్తున్నారు. ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన అధికారులు స్పందించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జీడబ్ల్యూఎంసీ కమిషనర్ స్పందించి సంబంధిత డివిజన్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని కోరుతున్నారు.ఆర్ఐలు, వార్డు అధికారుల పనితీరుపై సమీక్ష నిర్వహించి పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న సిబ్బందిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కారాన్ని ఉన్నతాధికారులు నిరంతరం పర్యవేక్షించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

రూ.లక్ష లంచం తీసుకుంటూ రంగారెడ్డి డీఎంహెచ్ఓకు చెందిన డ్రైవర్ పట్టివేత

హైదరాబాద్, అక్టోబర్ 5 (విజయ కెరటం):

ఫిజియోథెరపీ సెంటర్‌కు సంబంధించిన లైసెన్స్ విషయంలో లంచం డిమాండ్ చేసిన కేసులో ఏసీబీ అధికారులు ముగ్గురిపై చర్యలు చేపట్టారు. రంగారెడ్డి జిల్లా డీఎంహెచ్ఓ స్వర్ణకుమారి, హెల్త్ ఇన్‌స్పెక్టర్ ఎం. శ్రీనివాస్ ఆదేశాల మేరకు వారి వద్ద ప్రైవేట్ డ్రైవర్‌గా పనిచేస్తున్న మద్దూరికృష్ణయ్య రూ.2 లక్షలు లంచం డిమాండ్ చేసినట్లు ఏసీబీ తెలిపింది.ఫిజియోథెరపీ సెంటర్‌కు చెందిన స్వాధీనం చేసుకున్న తాళాలు తిరిగి ఇవ్వడం, లైసెన్స్ లేకుండా సెంటర్ నిర్వహణపై తదుపరి చర్యలు తీసుకోకుండా ఉండటం, కొత్త డీఎంహెచ్ఓ లైసెన్స్ ఇప్పించేందుకు లంచం అడిగినట్లు పేర్కొంది. ఈ క్రమంలో రూ.1 లక్ష లంచం స్వీకరిస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. లంచం మొత్తాన్ని డ్రైవర్ వద్ద నుంచి స్వాధీనం చేసుకున్నారు. డీఎంహెచ్ఓ స్వర్ణకుమారి (AO-1), హెల్త్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ (AO-2), ప్రైవేట్ డ్రైవర్ మద్దూరికృష్ణయ్య (AO-3)లను నాంపల్లిలోని ఏసీబీ కేసుల ప్రత్యేక కోర్టులో హాజరుపరిచి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు కొనసాగుతోందని ఏసీబీ వెల్లడించింది. ఫిరియాదుదారుడి వివరాలను భద్రతా కారణాల దృష్ట్యా వెల్లడించలేదు.



పాత నోట్‌బుక్స్‌తో కొత్త నోట్‌బుక్స్.. పర్యావరణ పరిరక్షణకు నాగార్జున కళాశాల వినూత్న అడుగు

నల్గొండ, అక్టోబర్ 5 (ఆదాబ్ హైదరాబాద్):

పర్యావరణ పరిరక్షణ, వనరుల పొదుపు లక్ష్యంగా నాగార్జున డిగ్రీ అండ్ పీజీ కళాశాల ఫిజిక్స్ విభాగం, 'యూత్ ఫర్ సేవా' స్వచ్ఛంద సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో వినూత్న కార్యక్రమం నిర్వహించారు. కళాశాలలో వినియోగంలో లేని పాత రికార్డులు, నోట్‌బుక్స్, కాగితాలను సేకరించి రీసైక్లింగ్ చేయించారు.రీసైక్లింగ్ ప్రక్రియ ద్వారా తయారైన కొత్త నోట్‌బుక్స్‌లో తొలి నోట్‌బుక్‌ను కళాశాల ప్రిన్సిపాల్ ఉపేందర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇప్పటికే వినియోగించిన కాగితాలను రీసైక్లింగ్ చేసి తిరిగి నోట్‌బుక్స్‌గా తయారు చేయాలనే 'యూత్ ఫర్ సేవా' ఆలోచన అభినందనీయమన్నారు. ఇలాంటి కార్యక్రమాలతో కాగితం వృథాను అరికట్టడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు.భవిష్యత్తులో రీసైక్లింగ్‌కు సంబంధించిన మరిన్ని కార్యక్రమాలు చేపడితే కళాశాల తరఫున పూర్తి సహకారం అందిస్తామని ప్రిన్సిపాల్ ఉపేందర్ పేర్కొన్నారు. వినియోగించిన కాగితాలను సద్వినియోగం చేసుకోవడం ద్వారా విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంచవచ్చని నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఫిజిక్స్ విభాగం హెచ్ఓడీ శ్రీనివాస్ రెడ్డి, 'యూత్ ఫర్ సేవా' నల్గొండ జిల్లా ఇన్‌చార్జ్ నాగేందర్, అధ్యాపకులు, లెక్చరర్లు తదితరులు పాల్గొన్నారు.



Printed, Published Edited and Owned by MAKSOOD AHAMED MOHAMED,H.No. 5-8-222/1, Shams Nagar, BTS Nalgonda - 508 001 (Telangana State) Printed at Shekhar Graphics & Printers H.No. 5-12-719, BTS, NALGONDA 508 001, (Telangana State), Published From: Shekhar Graphics & Printers H.No. 5-12-719, BTS, NALGONDA - 508 001 (A.P.), Editor: MAKSOOD AHAMED MOHAMED Cell: 9908408528